# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-03-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **కేంద్ర ప్రాయోజిత పథకాలకు నిధులు విడుదలయ్యేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
2. **లోక్‌సభలో సీట్ల సంఖ్యను జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేస్తే దక్షిణ భారత దేశానికి నష్టం కలుగుతుందని తెలంగాణా ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు.**
3. **ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా అనేక చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు.**
4. **తెలంగాణలో రహదారుల నిర్మాణానికి హ్యామ్ విధానాన్ని అనుసరిస్తున్నామని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.**
5. **భారత స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించిన ముగ్గురు స్వాతంత్ర్య సమర యోధుల ఆత్మార్పణను గుర్తు చేసుకుంటూ ఈరోజు అమరవీరుల సంస్మరణ దినం పాటిస్తున్నారు.**

==========================

కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన సమగ్ర సమాచారం అందించి సకాలంలో నిధులు విడుదలయ్యేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో వారంలో ముగుస్తున్నందున రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆ శాఖ కార్యదర్శి రోనాల్డ్‌రాస్ పాల్గొన్నారు. కేంద్ర పథకాలకు సంబంధించి ఐదు శాఖల నుంచి నిధులు రావాల్సి ఉందని ఈ సందర్భంగా అధికారులు చెప్పగా.. కేంద్రంతో సంప్రదింపులు జరిపి ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు ఆ నిధులు తేవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

--------------------------

లోక్‌సభలో సీట్ల సంఖ్యను జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేస్తే అది దక్షిణ భారత దేశానికి నష్టం కలిగిస్తుందని తెలంగాణా ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి స్పష్టంచేశారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో చెన్నైలో నిన్న నిర్వహించిన 'న్యాయమైన పునర్విభజన' సంయుక్త కార్యాచరణ కమిటీ తొలి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో సంబంధం లేకుండా చిన్న రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో లోక్‌సభ సీట్లను ఏర్పాటు చేసినట్లే దక్షిణ భారత రాష్ట్రాలకు అవకాశమివ్వాలని ఆయన కోరారు.

-----------------------------

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా అనేక చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఇప్పటివరకు నెలలో మూడో శనివారం మాత్రమే ఉన్న 'నో బ్యాగ్ డే'ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతి శనివారం అమలు చేస్తామని ఆయన ప్రకటించారు. ఆరోజు విద్యార్థులకు సమకాలీన అంశాలపై చర్చలు, సదస్సులు, క్రీడలు, వివిధ పోటీలు నిర్వహిస్తామని మంత్రి తెలిపారు.

-----------------------------

తెలంగాణలో తమ ప్రభుత్వం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుసరించి రోడ్లు నిర్మాణం చేయట్లేదని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. శాసనసభలో నిన్న హరీశ్‌రావు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ రాష్ట్రంలో హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో రహదారులు వేస్తున్నామనీ పీపీటీ, హ్యామ్ రెండు వేర్వేరు విధానాలని వివరించారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌ను 18 నెలల్లో పూర్తి చేస్తామని పేర్కొంటూ...

..వాయిస్.. 33 సెకన్లు....

-----------------------------

దిల్లీ వేదికగా జరుగుతున్న ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి పతకాలు సాధించిన రాష్ట్ర క్రీడాకారులకు క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ క్రీడలో పతకాలు సాధించిన రొంగలి శివ, షేక్‌బాబు, వి.భవాని, అంబటి స్వరాజ్ రాష్ట్ర ఖ్యాతిని పెంచారని కొనియాడారు. ఇప్పటికే రాష్ట్రంలో దివ్యాంగుల కోసం నిర్మించే క్రీడా కేంద్రానికి కేంద్ర ప్రభుత్వం 200 కోట్ల రూపాయలు కేటాయించిందని గుర్తు చేశారు.

-----------------------------

తెలంగాణ వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో మహిళలకు మినీ పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి పి. శ్రీధర్‌బాబు తెలిపారు. నిన్న శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహంపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ మహిళా పారిశ్రామికవేత్తలను అన్ని విధాలా ప్రోత్సహించేలా వారికి శిక్షణ కోసం అకాడమీ నెలకొల్పుతామని ప్రకటించారు. టి-ప్రైడ్ పథకం కింద 75 లక్షల రూపాయలలోపు రుణాలు తీసుకున్నవారికి 45 శాతం, 10 లక్షల రూపాయలలోపు రుణాలు పొందిన ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు మూడో వంతు రాయితీ ఇవ్వనున్నట్లు మంత్రి వివరించారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఈ సంవత్సరం 8 వేల 3 కోట్ల 22 లక్షల రూపాయల విలువైన 34 లక్షల 78 వేల 445 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుండి కోనుగోలు చేశామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తెనాలిలోని కార్యాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, గత ప్రభుత్వం 2024లో కొనుగోలు చేసిన దానికన్నా 746 శాతం ఎక్కువగా ధాన్యాన్ని కూటమి ప్రభుత్వం కొనుగోలు చేసిందని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకానికి తొలిసారిగా సన్నబియ్యం అందించబోతున్నామని మంత్రి వివరిస్తూ..

..వాయిస్.. 20 సెకన్లు....

---------------------------

బాపట్ల జిల్లా,అద్దంకి నియోజకవర్గంలో దాతలు అందించిన నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా స్వచ్ఛంద సంస్థల సహకారంతో 40 మంది దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటీలను పంపిణీ చేసిన అనంతరం లబ్ధిదారులైన 17 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుమారు 9 కమిటీ హాల్ నిర్మించినట్లు వెల్లడించారు. వచ్చే ఏడాదికి మరో 10 కమ్యూనిటీ హాల్ లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు స్పష్టం చేశారు.

---------------------------

భారత స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించిన స్వాతంత్ర్య సమర యోధులు సర్దార్ భగత్ సింగ్ ...., సుఖ్ దేవ్ థాపర్ ..., శివరాం రాజ్ గురుల ఆత్మార్పణను గుర్తు చేసుకుంటూ ఈరోజు అమరవీరుల సంస్మరణ దినం పాటిస్తున్నారు. 1931వ సంవత్సరం మార్చి 23వ తేదీన ప్రస్తుత పాకిస్తాన్‌లోని లాహోర్ పట్టణంలో ఈ ముగ్గురు యోధులను బ్రిటిష్ వలస పాలకులు ఉరి తీశారు. ఈ సంఘటన భారత స్వాతంత్ర్య పోరాటంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. దేశం కోసం ప్రాణాలను అర్పించిన ఈ అమరవీరుల సేవలను ప్రతి ఏటా మార్చి 23వ తేదీన భారతదేశ ప్రజలు గుర్తు చేసుకుంటూ... ఆ వీరులకు అంజలి ఘటిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని నక్కపల్లిలో ఏర్పాటుచేస్తున్న బల్క్‌డ్రగ్ పార్క్ ద్వారా 54 వేల 307 మందికి ఉపాధి అవకాశాలు రానున్నట్లు పార్లమెంటు స్థాయీసంఘం తెలిపింది. మొత్తం 14 వందల 38 కోట్ల రూపాయలతో ఏర్పాటుచేస్తున్న ఈ పార్క్ లో ప్రస్తుతం రహదారులు, విద్యుత్తు, నీరు, ఇతర మౌలికవసతుల నిర్మాణంకోసం టెండర్లు పిలిచినట్లు వెల్లడించింది. గుత్తేదారు స్థలం శుభ్రత, ప్రహరీనిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపింది. ఈ ప్లాంట్‌కోసం కేంద్రం రూ.225 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.132 కోట్లు విడుదల చేయగా జనవరి 31 నాటికి 46.36 కోట్ల రూపాయలు వినియోగించినట్లు స్థాయీసంఘం పేర్కొంది.

---------------------------

విపత్తు నిర్వహణలో అత్యాధునిక సమాచార పరికరాలు అవసరమని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా తెలిపారు. అమరావతిలోని విపత్తుల నిర్వహణ కార్యాలయంలో నిన్న నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తీరప్రాంతాల్లో తహసీల్దారు స్థాయి నుంచి కలెక్టర్ వరకు ప్రతి అధికారికీ శాటిలైట్ ఫోన్లు అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గత ఐదేళ్లలో కొనుగోలు చేసిన పరికరాల వినియోగ స్థితి, రాబోయే వర్షాకాలానికి అవసరమైన సన్నద్ధత, తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై చర్చించారు. రసాయన కర్మాగారాల సమీపంలో గాలి నాణ్యత పర్యవేక్షణ పరికరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదరణ-3 పథకం ద్వారా ఆధునిక పరికరాలు, పనిముట్లు అందించి బీసీ కుల వృత్తికారులకు మెరుగైన జీవనోపాధి కల్పించనుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సత్యనారాయణ తెలిపారు. నిన్న కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి కులవృత్తుల ప్రోత్సాహనికి రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించి ఆదరణ-3 పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలియజేశారు. ఇందులో బాగంగా వృత్తి పనులలో వచ్చిన ఆధునిక సాంకేతికను బీసీ వృత్తికారులకు అందించి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పటిష్టమైన కార్యాచరణ రూపొందించిందని పేర్కొన్నారు.

======================